

రోశమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

## మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

తొగట, ఫిబ్రవరి 27: మండలంలోని గోవర్ధనగిరి తాజా మాజీ సర్పంచ్ తోయేటి ఎల్లాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఎల్లం మాతృమూర్తి రోశమ్మ (90) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుకున్న ఎమ్మెల్యే మంగళవారం గోవర్ధనగిరిలో ఎల్లంను పరామర్శించారు. రోశమ్మ చిత్రపటానికి నివాళి అర్పించి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కనకయ్య, కొమురయ్య ఉన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

## డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేట, ఫిబ్రవరి 27: టీఎన్‌జీవో సహకార శాఖ ఆఫీసర్స్ యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న టీఎన్జీవోస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి నాగేశ్వర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను బ్రహ్మాండంగా నిర్వహించి రైతులకు అన్నివేళలా సహాయ సహకారాలు అందించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 317 జీవోపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడం హర్షించే దగ్గ విషయమన్నారు. సమావేశంలో సహకార శాఖ కార్యదర్శి శ్రీకాంత్, కలెక్టరేట్ అధ్యక్షుడు నరేశ్, కార్యదర్శి నగేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎంపీ బండి సంజయ్ ఫ్లెక్సీ దహనం



ఎంపీ బండి సంజయ్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట, ఫిబ్రవరి 27: కాంగ్రెస్ మంత్రులు, నాయకులపై వ్యాఖ్యలు చేసే ముందు బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తగిన గుణపాఠం తప్పదని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ హెచ్చరించారు. మంగళవారం ముస్తాబాద్ చౌరస్తా వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. బండి సంజయ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రజలు ఓడించినా బండి సంజయ్‌కు జ్ఞానోదయం కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్ వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు, నరసింహారెడ్డి, గోపి, అడ్వకేట్ రేణుక, వనజ పాల్గొన్నారు.

## 'బండి' యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం

జగదేవ్‌పూర్ ఫిబ్రవరి 27: ఎంపీ బండి సంజయ్ యాత్రను అడ్డుకొని బీజేపీ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికం అని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి ఆరోపించారు. మంగళవారం ఆయన జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీ బండి సంజయ్ హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజాయిత యాత్ర చేపట్టారన్నారు. ఎంపీ సంజయ్ యాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం అపసోపాలు పడుతున్నదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## చేతిరాతను అందంగా మార్చుకుందాం



చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మర్క్యాక్, ఫిబ్రవరి 27: విద్యార్థులు చిన్నతనం నుంచే తమ చేతిరాతపై శ్రద్ధ చూపాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస, చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కేవలం 30 రోజులు సాధన చేస్తే తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో చేతిరాతను అందంగా మార్చుకోవచ్చన్నారు. సుమారు 250 మంది విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో విద్యార్థులకు చేతిరాత సామగ్రిని అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లతీసైదా, టీచర్లు పాల్గొన్నారు.

## సందడిగా 2కే వాకథాన్

సిద్దిపేట, ఫిబ్రవరి 27: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట కోమటిచెరువుపై గల రూబి నెక్లెస్ రోడ్డుపై రెండో రోజు మంగళవారం 2కెకేవాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, బ్యాంక్ రీజియన్ అధికారి వికాస్, డిప్యూటీ అధికారి రాఘవులు పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ సేవింగ్స్, పవర్ అండ్ కంపోజింగ్, బ్యాకింగ్ అవసరాలు, డిజిటల్, సైబర్ హైజీన్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.




కోమటిచెరువుపై ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల ర్యాలీ



## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పరీక్షకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్ననేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్ చెప్పారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 44 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 20,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్ భవిష్యత్‌కు పునాది లాంటిదని, పరీక్షలు బాగా రాసి తల్లిదండ్రులకు, కళాశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్**

ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి మార్చి 19 వరకు జరగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని.. విద్యార్థులు పరీక్షా సమయం కంటే అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.

### ఇంటర్ భవిష్యత్‌కు మలుపు

చేర్యాల, ఫిబ్రవరి 27: నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలను విద్యార్థులు ఎటువంటి ఆలోచనలను మనసులోకి రానివ్వకుండా, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో కోరారు. ఇంటర్ విద్యార్థులకు ఆల్ దిబెస్ట్ చెప్పారు. భవిష్యత్‌కు కీలకమైన మలుపు ఇంటర్మీడియట్ అన్నారు.

## 'మల్లన్న' హుండీ ఆదాయం రూ.37.79 లక్షలు

చేర్యాల, ఫిబ్రవరి 27: కొమురవెల్లి మల్లికార్జున స్వామి 6వ ఆదివారం సందర్భంగా రూ.37,79,389 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అర్జీత సేవలు, గదులు, దర్శనాలు, ప్రసాదాల విక్రయం, తదితర వాటి ద్వారా శనివారం రూ.4,18,183, ఆదివారం రూ.29,16,201, సోమవారం రూ.4,45,005 ఆదాయం వచ్చిందన్నారు. ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## కొమురవెల్లి ఆలయంలో ఈ-టెండర్ రద్దు

చేర్యాల, ఫిబ్రవరి 27: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించి ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సామగ్రికి సంబంధించిన ఈటెండర్‌ను దేవాదాయ శాఖ కమిషనర్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లో ఒకే సంస్థ పాల్గొనడంతో ఆలయవర్గాలు దానికే హక్కులు కట్టబెట్టాయి. రెండేండ్లుగా ఇదే సంస్థ ఆన్‌లైన్‌లో టెండర్‌లో హక్కులు దక్కించుకొని అధిక ధరలకు సామగ్రి సరఫరా చేస్తున్నదని, పలువురు భక్తుల ఫిర్యాదు మేరకు దేవాదాయశాఖ కమిషనర్ నిశితంగా పరిశీలించిన అనంతరం సంస్థ టెండర్‌ను రద్దు చేశారు. తక్కువ ధరలకు సామగ్రిని సరఫరా చేసే సంస్థలకు టెండర్ హక్కులు ఇవ్వాలని సూచిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ మార్కెట్‌లో రూ.1,350కు లభించే సీలింగ్ ఫ్యాన్‌కు సంస్థ నిర్వాహకులు రూ.2,650, మార్కెట్‌లో 150 వాట్స్ బల్బు రూ.3,000లకు లభిస్తుండగా టెండర్‌దారులు రూ.8,500, రూ.400లకు లభించే ఎల్ఈడీ బల్బులు రూ.1,350లకు సరఫరా చేస్తున్నట్లు స్థానికంగా చర్చించుకుంటునారు. ఇప్పటివరకు అధిక ధరలకు కొనుగోలు చేసిన సామగ్రికి మార్కెట్ ధర మాత్రమే చెల్లించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. టెండర్ రద్దు విషయమై ఆలయ ఈవో బాలాజీని వివరణ కోరగా టెండర్ రద్దు చేయాలని ఆదేశాలు అందాయని, త్వరలోనే టెండర్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటివరకు టెండరు పొందిన సంస్థ ఆలయానికి సరఫరా చేసిన సామగ్రికి సంబంధించి డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ సూచనల మేరకు నడుచుకుంటామన్నారు.

## వేసవిలో సమస్యలు తలెత్తకుండా చూడాలి

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 27: వేసవి దృష్ట్యా పట్టణ ప్రజలకు తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా సంబంధిత ఇంజినీర్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం తాగునీరు, విద్యుత్ విభాగాల సిబ్బంది, మున్సిపల్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీరు, విద్యు త్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, సమస్య ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. టెండర్లు పూర్తయిన, అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్లు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

## సఖీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చేర్యాల, ఫిబ్రవరి 27: మహిళల సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న సఖీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ నాగరాజు, జెండర్ స్పెషలిస్ట్ పద్మ, లావణ్య కోరారు. పట్టణంలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, మహిళలతో బేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, జెండర్ సమానత్వం, పిల్ల హక్కులు, గర్భస్థ శిశు నిర్ధారణ నిరోధక చట్టం-1994, గృహహింస నిరోధక చట్టం-2005, చైల్డ్ మ్యారేజ్ చట్టం-2006, బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన స్కీమ్, ఆర్థిక పరమైన అం శాలను వివరించారు. సఖి సెంటర్ (181), పోలీస్ 100, చైల్డ్‌లైన్ 1098 సేవలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, టీచర్ కృష్ణవేణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాహుల్ కుమార్

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

గజ్వేల్, ఫిబ్రవరి 27: వచ్చే నెల 3న నిర్వహించే పల్స్ పోలీయోను విజయవంతం చేయాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహుల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4,200 మంది ఐదేండ్లలోపు చిన్నారులున్నారని, ప్రతిఒక్కరూ పోలియో చుక్కలు వేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు మూడు రూట్లుగా విభజించి 31 కేంద్రాల్లో చుక్కలమందు వేస్తామన్నారు. మరుసటి రెండు రోజులపాటు ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య సిబ్బంది కేంద్రానికి రాని చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయపాల్‌రెడ్డి, డాక్టర్ ప్రణయ్‌కుమార్, సీడీపీవో వెంకటరాజమ్మ, ఎంఈవో సునీత పాల్గొన్నారు.

## వృథాగా మిషన్ భగీరథ జలం



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

చేర్యాల, ఫిబ్రవరి 27: పట్టణంలో కొనసాగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నాడు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డు నిర్మాణ పనుల్లో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మంగళవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన రోడ్డుపై గొయ్యి తీయడంతో దానికిందే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి గోదావరి జలాలు పైకి ఎగజిమ్మాయి. దీంతో నీళ్లు వృథాగా పోయాయి. రోడ్డుపై కల్వర్టు నిర్మించేందుకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో అక్కడే ఉన్న పైపులైన్ గమనించకపోవడంతో పైపులైన్ పగిలిపోయింది. జేసీబీ సహాయంతో నీటి వృథాను అరికట్టే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

## మూఢనమ్మకాలపై అవగాహన



విద్యార్థి చేతిపై మంట సృష్టిస్తున్న నరేశ్

బెజ్జంకి, ఫిబ్రవరి 27: వ్యక్తిత్వ వికాసం, మూఢ నమ్మకాల నిర్మూలనపై మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేశ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మూఢనమ్మకాల పేరుతో మోసపోతున్నారన్నారు. విద్యార్థులు శాస్త్రీయ కోణంలో అన్ని అంశాలను శోధించి మూఢనమ్మల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. సైన్స్ మ్యాజిక్‌తో ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్ పోసి కాల్చడం, నోట్లో మంటలు, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాకెట్లు తీయడం, విద్యార్థి వాచీ మాయం చేయడం వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్‌రావు, ప్రత్యేకాధికారి శ్వేత, హెడ్‌కానిస్టేబుల్ కనుకయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి



గజ్వేల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్యులు

గజ్వేల్‌అర్బన్, ఫిబ్రవరి 27: బక్రిచెప్యాలలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గజ్వేల్ కోర్టు వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. మహాత్ముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు ఎంతటివారైనా పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సిద్ధి భిక్షపతి, అత్తెల్లి లక్ష్మయ్య నంగునూరి సత్యనారాయణ, ప్రభాకర్, తోట భిక్షపతి, వెంకటేశం, శివకుమార్, చంద్రశేఖర్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ అందుకుంటున్న కొండపాక కళాశాల విద్యార్థులు

## విద్యార్థులకు మలబార్ స్కాలర్‌షిప్

కొండపాక, ఫిబ్రవరి 27: కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 31మంది బాలికలు మలబార్ స్కాలర్‌షిప్ ద్వారా రూ.2,68,000 పొందారు. మంగళవారం పింగిలి మహిళా డిగ్రీ కళాశాల హన్మకొండలో జరిగిన కార్యక్రమంలో ఈ స్కాలర్‌షిప్పులను విద్యార్థులకు అందజేశారు. కొండపాక కళాశాల విద్యార్థులకు మొట్టమొదటిసారిగా స్కాలర్‌షిప్పులు రావడానికి విశేషంగా కృషి చేసిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వంగ అమరేందర్‌రెడ్డిని సిద్దిపేట డీఐఈవో సూర్యప్రకాశ్, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి ప్రత్యేకంగా అభినందించారు.

## ఫీజు చెల్లిస్తేనే విద్యార్థులకు హాల్ టికెట్లు

### కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల నాయకుల ఆందోళన



దుబ్బాకలో వాగ్దేవి జూనియర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏఐపీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు

దుబ్బాక, ఫిబ్రవరి 27: ఫీజు చెల్లిస్తేనే.. హాల్ టికెట్ ఇస్తామని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడంపై మంగళవారం పలు విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. దుబ్బాక పట్టణంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న పలువురు విద్యార్థులకు కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు మాట్లాడేందుకు ప్రయత్నించినా పట్టించుకోకపోవడమే గాక తమతో దురుసుగా ప్రవర్తించారంటూ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల ధర్నాకు దిగారు. సుమారు 2 గంటల పాటు కళాశాల ముందు ధర్నా చేశారు. పోలీసుల జోక్యంతో విరమించారు. ప్రైవేట్ యాజమాన్యాలు హాల్ టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడం బాధాకరమన్నారు. విద్యార్థి సంఘాలతో దురుసుగా ప్రవర్తించిన కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ఫీజుల కోసం ఒత్తిడి చేయలేదని, ఫీజులు కట్టిన వారికి ముందుగా హాల్‌టికెట్‌లు ఇచ్చామన్నారు. కావాలనే పలువురు ఆందోళన చేస్తున్నారని తెలిపారు.

## దొంగల ముఠా అరెస్ట్

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 27: కొండపాక మండలం వెలికట్ట చౌరస్తాలో మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా దొంగల ముఠాను పట్టుకొని, వారి నుంచి 1,280 కిలోల అల్యూమినియం వైర్, కండక్టర్ వైర్, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ బాలాజీ తెలిపారు. కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమక్షంలో వివరాలు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని గ్రామాలు, వెంచర్లలో కరెంట్ స్తంభాల నుంచి అల్యూమినియం వైర్ కట్‌చేసి ఆటోలో వేసుకొని సిద్దిపేటలో మనోజ్‌సింగ్, ప్రజ్ఞాపూర్‌లో వెంకటేశ్‌లకు అమ్ముతున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారిపై కూడా కేసు నమో దు చేసినట్లు తెలిపారు. కుకునూర్‌పల్లి, గజ్వేల్, ఎల్కతుర్తి, మానకొండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు దొంగతనాలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దుల్మిట్ట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గగులోత్ చంద్రశేఖర్, కరీంనగర్ జిల్లా కేశవపట్నంకు చెందిన ఆగుళ్ల శ్రీనివాస్, హుజురాబాద్‌కు చెందిన కడారి జలంధర్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రైతులు, వెంచర్ల యజమానులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న అల్యూమినియం వైర్‌తో నిందితులు

## ఇంటి నంబర్లను పరిశీలిస్తాం

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలో ఇంటి నంబర్ల పరిశీలనను త్వరలోనే చేపడుతామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ బడ్జెట్ సందర్భంగా పాలకవర్గ సభ్యులు ఇంటినంబర్లను మరోమారు పరిశీలించాలని కోరారన్నారు. ఇండ్లకు సంబంధించి పన్ను చెల్లింపులు సరిగా జరగడం లేదని, దీంతో ఆదాయానికి గండి పడుతున్నదని పాలకవర్గ సభ్యులు ఫిర్యాదులు చేశారన్నారు. పాలకవర్గ సభ్యుల సూచనల మేర కు త్వరలోనే ఇండ్లను పరిశీలించి నంబర్లు లేని వాటికి నంబర్లు కేటాయించి పన్నులు వసూలు చేసేందుకు చర్యలు చేపడుతామని కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి చర్యలు చేపడుతామన్నారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మాతృవియోగం

చేర్యాల, ఫిబ్రవరి 27: చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణికి మాతృవియోగం కలిగింది. చైర్‌పర్సన్ తల్లి పీర్లపల్లి లక్ష్మి(90) కొన్నేండ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సిద్దిపేట మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో మృతి చెందింది. ఆమెకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అంత్యక్రియలు బుధవారం జరుగనున్నాయి.

## వ్యక్తి ఆత్మహత్య

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 27: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని లకుడారం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన బొప్పెన పరశురాములు(30) గతంలో చిట్టీలు వేసేవాడు. అందులో నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. అప్పులు తీ ర్చేందుకు దుబాయ్ వెళ్లి వచ్చినా అప్పులు తీరకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో కుటుంబ సభ్యులకు తిరుపతి వెళ్తున్నానని చెప్పి లకుడారం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసుకుల సమాచారం అందించడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 27: మద్దూరు మండలం లద్నూర్ గ్రామంలోని జమ్మికుంట నుంచి ఇటుక బట్టీల కోసం అక్రమంగా మట్టిని తరలిస్తుండగా తహసీల్దార్ అనంతరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా కుంటలో నుంచి మట్టిని తవ్వుతున్నారనే సమాచారం మేరకు అధికారులను పంపించి తవ్వకాలను నిలిపివేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా చెరువులు, కుంటల్లో నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఇసుక స్వాధీనం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 27: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సిద్దిపేట వన్‌టౌన్ సర్కిల్ పరిధిలోని నాగదేవత ఆలయం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ మేరకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని, ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎంజేపీలో సైన్స్ దినోత్సవం

వర్గల్, ఫిబ్రవరి 27: జాతీయసైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్గల్ మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు సైన్స్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు క్విజ్ పోటీలు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోవిందారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.